మధ్యవర్తిత్వంతో సామరస్యపూర్వక పరిష్కారం



1కే వాక్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



వన్‌కే వాక్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



1కే వాక్‌లో పాల్గొన్న న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్, న్యాయవాదులు

బద్వేలు అర్బన్ : కేసుల్లో మధ్యవర్తిత్వంతో త్వరిత ప్రయోజనం చేకూరడంతో పాటు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్‌కుమార్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు మధ్యవర్తిత్వం – దేశం కోసం అనే కార్యక్రమంపై బుధవారం స్థానిక కోర్టు ఆవరణ నుండి 1కెవాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులలో కేసులు ఎక్కువ పెండింగ్ ఉన్నందువలన రాజీపడదగిన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం సుప్రీం కోర్టు కల్పించిందని తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడంతో పాటు మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాలు చర్చించుకుని కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, అర్బన్ ఎస్‌ఐ–2 జయరామిరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై వన్ కే వాక్

ప్రొద్దుటూరు క్రైం : మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు నుంచి రాజీవ్‌సర్కిల్ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం వన్ కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, రెండవ అదనపు జిల్లా జడ్జి కే సత్యకుమారి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అంటే ఒక మధ్యవర్తి తన నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకునే ప్రత్యేక ప్రక్రియ అని చెప్పారు. ఇది పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అని, దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఆదేశిక నియమాలు అంటూ ఏమీ లేవని తెలిపారు. ఏదాది పొడవునా చేసుకునే ప్రక్రియ అని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ ప్రతిభ, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానంపై 1కే వాక్

మైదుకూరు : న్యాయ విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు మైదుకూరులో మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం 1కే వాక్ నిర్వహించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మైదుకూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఈ 1కే వాక్‌ను నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని కోర్టు వద్ద నుంచి రాయల కూడలి వరకు న్యాయమూర్తి ఖాజా మొయినుద్దీన్, న్యాయవాదులు నడకను నిర్వహించి అక్కడ న్యాయ విజ్ఞానంపై మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమేసుల శివప్రసాద్, ప్యానల్ అడ్వకేట్స్ ఎస్.శివరామకృష్ణ, ఎస్.శ్రీనివాసులు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

బద్వేలు అర్బన్ : బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం త్వరలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ఇన్‌చార్జి నూకానమ్మ ఆధ్వర్యంలో ఆగస్టు 18, 19 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బీసీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబాన్‌బీ, మరాఠా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు సాగర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ యాదవ్, నియోజకవర్గ, పట్టణ కన్వీనర్‌లు సుబ్బరాయుడు, నాగార్జున, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామంలో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ మాబు షరీఫ్, ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ నిధులతో అంకాలమ్మ గుడి వద్దకు, ముస్లిం శ్మశాన వాటిక వద్దకు సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని వారు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మల చిన్న, వరికూటి రమణారెడ్డి, గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ప్రదీప్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాశినాయన : ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి అని ఎంఈఓ నిర్మల తెలిపారు. బుధవారం మండలంలోని కొత్త ఉప్పలూరు ఎంపీపీ పాఠశాలలో 8 సంవత్సరాలు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన టి.ప్రదీప్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు యు.సుబ్రహ్మణ్యం, వాకా చంద్రశేఖర్, బాలరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, పీఆర్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరమణ, గ్రామ సర్పంచ్ రాజనారాయణరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్విజ్, డ్రాయింగ్ పోటీలు


గెలుపొందిన విద్యార్థులతో హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు

మైదుకూరు : స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో వరల్డ్ యూత్ స్కిల్స్ డే సందర్భంగా బుధవారం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఇలియాస్ అహ్మద్ మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాలలో ఐటీ, ఐటీఈఎస్, ఎలక్ట్రానిక్స్, బీఎఫ్ఎస్ఐ కోర్సులను నేర్చుకోవాలని, వాటి వల్ల భవిష్యత్తులో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం నరకడం నేరం


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

కలసపాడు : ఎర్రచందనం నరకడం, రవాణా చేయడం నేరమని పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఎగువరామాపురంలో బుధవారం రాత్రి పోలీసుల కళాజాతా బృందం ఎర్రచందనం కాపాడుదాం – అడవి తల్లిని రక్షిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎర్రచందనం చెట్లను ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించి వాటిని కాపాడాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు జరగవన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని సూచించారు. కడప నరసరాజు కళాజాతా బృందం పాటలు, నాటకాల ద్వారా అడవులను రక్షించాలని ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిమోతి, పోలీసు, అటవీశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంటకు ఇ–క్రాప్ చేయించాలి

కాశినాయన : రైతులు సాగు చేసే ప్రతి పంటకు ఇ–క్రాప్ చేయించుకోవాలని ఏడీఏ మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నరసాపురం, మూలపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో భూసారం, తెగుళ్ల నివారణకు కావాల్సిన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కషాయాలను రైతులు పంటలకు ఉపయోగించాలని సూచించారు. అలాగే ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఇ–క్రాప్ నమోదు చేయించడంతోపాటు పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలిపారు. రైతులు నారుమడులు పోసిన తర్వాత 12 రోజులకు కార్బోఫెరాన్ గుళికలను నారుమడిలో చల్లాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రమోహన్, ఏఈఓ రవి, వీఏఏ మధు, రైతులు పాల్గొన్నారు.


మూలపల్లెలో నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్ పామ్ పంటను సాగు చేయండి

దువ్వూరు : రైతులు ఆయిల్ పామ్ పంటపై అవగాహన పెంచుకుని సాగు చేయాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు అమరనాథరెడ్డి, రామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ మొక్కలు నాటుకునేందుకు హెక్టార్‌కు రూ.29 వేలు అందిస్తుందన్నారు. నాలుగేళ్లపాటు మొక్కల యాజమాన్యం, అంతర పంటలను సాగు చేసుకునేందుకు ఏడాదికి హెడాక్టర్‌కు రూ.10 వేలు సబ్సిడీ రూపంలో అందిస్తామని తెలిపారు. రియ కంపెనీ ప్రతినిధి పవన్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని, పంట సాగు చేశాక కంపెనీ ప్రతినిధులు దగ్గరుండి యాజమాన్య పద్ధతులు రైతులకు నేర్పిస్తారన్నారు. రైతులు పంట సాగు చేసే ముందు కంపెనీ ప్రతినిధుల నుండి అగ్రిమెంట్లు తీసుకున్న తర్వాతే పంట సాగు చేయాలని సూచించారు. ఖరీఫ్ పంట కాలానికి పసుపు, వరి, ఉల్లి, మినుము, జొన్న, కంది పంటలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ మాధవి, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

కలసపాడు : మండలంలోని తెల్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన యువకులు మోహన్‌రెడ్డి, రమణయ్య సైకిళ్లు, ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా తెల్లపాడు పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చెందిందన్నారు. పాఠశాలను అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు వచ్చి పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న కొండపేట గ్రామ విద్యార్థులకు రూ.25వేలు విలువ చేసే మూడు సైకిళ్లు, ఆట వస్తువులను అందించడం అభినందనీయమని తెలిపారు. తల్లిదండ్రులు, యువత బడిని గుడిగా భావించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. తరగతి గదులకు కొరత ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సహకరించాలన్నారు. దాతలు మోహన్‌రెడ్డి, రమణయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మరింత సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌రెడ్డి, గ్రామ పెద్దలు సుబ్బయ్య, రామమోహన్‌రెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దాతలు

అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

గోపవరం : మండలంలోని రాచాయపేటలో నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్ర భవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వం అద్దె ఇళ్లలో కొనసాగుతున్న కేంద్రాలకు నూతన భవనాలను మంజూరు చేయడంతో పాటు అవసరమైన నిధులను విడుదల చేసింది. రాచాయపేట అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.14 లక్షలు కేటాయించారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ శరవేగంగా పనులు చేయడం జరిగింది. స్లాబు దశ వరకు పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉన్నఫలంగా భవన నిర్మాణ పనులు సంబంధిత అధికారులు నిలిపివేశారు. తాము చెప్పే వరకు పనులు చేయవద్దని కాంట్రాక్టర్‌కు అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం అసంపూర్తిగానే ఉండిపోయింది. భవనం పూర్తయ్యేందుకు అవసరమైన నిధులు కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కానీ అధికారులు మాత్రం భవన నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించడం లేదని తెలిసింది. పక్కా భవనం పూర్తికాకపోవడంతో ప్రస్తుతం అద్దె ఇంట్లోనే కేంద్రం కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవన నిర్మాణ పనులు పూర్తి చేసి కేంద్రాన్ని చిన్నపిల్లలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అర్ధాంతరంగా నిలిచిపోయిన రాచాయపేట అంగన్వాడీ కేంద్రం నిర్మాణ పనులు

రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

పోరుమామిళ్ల : పట్టణంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పట్టించడం లేదని, అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపట్టినట్టు కనిపిస్తోందని ఆల్ ఇండియా మానవ హక్కుల సంఘం నాయకులు ఫణిరావు, రాఘవరెడ్డిలు ఆరోపించారు. రోడ్డు నిర్మాణంలో సిమెంట్ సక్రమంగా వాడకపోవడం వల్ల రోడ్డు నెర్రెలు చీలిపోతోందని చెప్పారు. పనులను పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు దరిదాపుల్లో కనిపించడం లేదని, హోటళ్లల్లో, లాడ్జీల్లో వారు సేద తీరుతుంటే ఇక్కడ కాంటాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. రాష్ట్ర రాజధానికి వెళ్లే ఈ రోడ్డు నాణ్యత లేకపోతే ఎంతకాలం మనగలదని వారు ప్రశ్నించారు. క్యూరింగ్ కూడా సక్రమంగా లేదన్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించాలని వారు కోరారు.


నాసిరకంగా చేపట్టిన రోడ్డు పనులు చూపుతున్న దృశ్యం

హామీలు నెరవేర్చకుండా బాబు మోసం చేశాడు

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో హామీలను గుప్పించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా మోసం చేశారంటూ మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం మైదుకూరు మున్సిపాలిటీలోని 5వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి ఇంటింటికి తిరిగి చంద్రబాబు ఇచ్చిన హామీలను, చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గుర్తు చేయగా కూటమి ప్రభుత్వం తమకేమి చేయలేదని, చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుకు చెందిన రాజేశ్వరమ్మ అనే మహిళ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తనకు కాపు నేస్తం, ఆసరా తదితర పథకాల కింద సాయం అందిందని, ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క సాయం అందలేదని మాజీ ఎమ్మెల్యేకు చెప్పింది. తమ కుటుంబ సభ్యుడు ఒకరు అనారోగ్యంతో ఉండగా ఆస్పత్రికి వెళితే ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేసేందుకు డాక్టర్లు నిరాకరించారని ఓ మైనారిటీ మహిళ వాపోయింది. మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో వందలాది జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తించిందని ఎంతో మంది పేద ప్రజలు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందారని తెలిపారు. ఆసరా, చేయూత, వాహన మిత్ర, అమ్మ ఒడి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వివరించారు. ఎన్నికల ముందు హామీలను ఇచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చకపోగా హామీలపై ప్రశిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. వారికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, మున్సిపాలిటీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, భరత్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, వార్డు నాయకులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, జమాల్, గౌస్, ఖాదర్, గౌస్ పీర్, మాబుచాన్, పిల్లి నాగయ్య, బీఎన్ కిట్టు, చొక్కం సంజీవరాయుడు, అన్నలూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మైనారిటీ మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికు నెలకు రూ.15వేల తక్కువ వేతనంతో జీవిస్తున్నారన్నారు. ఏడేళ్లుగా వారికి జీతం పెంచలేదని, జీఓ 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కోవిడ్ కార్మికుల సమస్యలపై తులసిరెడ్డి, సీఐటీయూ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సాల్మన్, చంటి, గంగాధర్‌రెడ్డి, భాస్కర్, శివ, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం

కలసపాడు : స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 9 గంటలకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ.. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ సగిలి సుదర్శన్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి

పోరుమామిళ్ల : రైతులు అవసరం మేరకే ఎరువులు వాడాలని, పంట బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పుల్లివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.

డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాలి

ప్రొద్దుటూరు : విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాలు ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ బుధవారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీలు విమర్శలు చేశాయన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు డిగ్రీ ప్రవేశాలు ఆలస్యం చేయడం గర్హణీయమన్నారు. తెలంగాణ, ఇతర పొరుగు రాష్ట్రాల్లో నెల రోజుల క్రితం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, మన రాష్ట్రంలో ఆలస్యం కావడంతో డిగ్రీలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణకు ఆదేశం

మైదుకూరు : మైదుకూరులోని ఆలయ భూముల విషయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారించాలని దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశించినట్టు మైదుకూరుకు చెందిన మాజీ సర్పంచ్ చొక్కం రమేష్ తెలిపారు. మైదుకూరులోని 1845/1, 2, 3ఏ, 3బీ, 3సీ, 1845/4లోని 10.20 ఎకరాల భూమిపై నిబంధనలకు విరుద్ధంగా 130 రిజిస్ట్రేషన్లు అయినట్టు తాను చేసిన ఫిర్యాదుపై దేవాదాయశాఖ అధికారులు స్పందించినట్టు రమేష్ పేర్కొన్నారు. ఇటీవల ఇదే విషయమై స్టాంప్‌లు రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారని వివరించారు. తాజాగా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌ను అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారించాల్సిందిగా ఆదేశించినట్టు తెలిపారు.

రక్తదానం చేయడం అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు తెలిపారు. స్థానిక శివాలయం సెంటర్‌లో బుధవారం ప్రొద్దుటూరులోని స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని సేవా సంస్థల నిర్వాహకులు ఐకమత్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సాయికృప ల్యాబ్ యాజమాన్యం రక్తగ్రూపు నిర్ధారణ చేశారు. పలువురు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా, సీమాంధ్ర బీసీ సంక్షేమ నాయకుడు చల్లా రాజగోపాల్ శిబిరాన్ని సందర్శించారు.

వైష్ణవి మృతి బాధాకరం

పోరుమామిళ్ల : ప్రొద్దుటూరు గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థిని వైష్ణవి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ అభిలాష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని వైష్ణవి మృతి అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం దారుణమన్నారు. వైష్ణవి అంశంలో అధికారులు న్యాయం చేయకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదన్నారు.

విస్తృతస్థాయి సమావేశాలు విజయవంతం చేయండి

అట్లూరు : బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు, అట్లూరు మండలాల్లో గురువారం నిర్వహించనున్న విస్తృతస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టో నిజాలు ప్రజలకు గుర్తుకు తెస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఉదయం 9 గంటలకు కలసపాడు మండలంలోని చిత్తా మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించడం జరుగుతుందని, అలాగే మధ్యాహ్నం 3:30 గంటలకు అట్లూరు మండలంలో కడప – బద్వేలు ప్రధాన రహదారి పక్కన అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కుంభగిరి మల్లికార్జునరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ విస్తృతస్థాయి సమావేశాలకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యా సామగ్రిని అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

కాశినాయన : మండలంలోని మూలపల్లె ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న 32 మంది విద్యార్థులకు పోరుమామిళ్ల శ్రీకృష్ణ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ పి.బాలకృష్ణారెడ్డి రూ.6,500 విలువ చేసే ప్రింటెడ్ కాపీ రైటింగ్, 120 నోట్ పుస్తకాలు, కాంపాక్స్ పెట్టెలతోపాటు విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించిన దాతకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పాండురంగాచారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మాస కల్యాణం గోడ పోస్టర్ల ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం వద్ద బుధవారం శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి మాస కల్యాణ మహోత్సవ గోడ పత్రాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఆలయ పిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కల్యాణ మహోత్సవానికి ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. వచ్చే నెల 6న ఉదయం 9 గంటలకు బ్రహ్మంగారిమఠం ప్రాంగణం వద్ద ఉన్న కల్యాణ మండపంలో లోక కల్యాణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పిట్ పర్సన్ తెలిపారు.